ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




కడప

జిల్లా వార్తలు

5

బుధవారం 10 ఏప్రిల్ 2024



- ఎన్నికల వేళ వైసీపీ నుంచి టీడీపీలోకి క్యూ
- మైదుకూరులో మాజీ మంత్రి డీఎల్ మద్దతు
- ప్రచారంలో కూటమి ముందంజ
- వైసీపీలో నైరాశ్యం

టీడీపీలో నయాజోష్

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సొంత జిల్లాలో టీడీపీ క్రమేణా పుంజుకుని బలపడుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థుల ఖరారు తరువాత ఇంకాస్త జోరుగా ముందుకు వెళుతోంది. వైసీపీ నుంచి క్షేత్ర స్థాయిలో కేడరు, ద్వితీయశ్రేణి నేతలంతా సైకిలు ఎక్కుతుండడంతో టీడీపీలో నయాజోష్ నెలకొంది. ఇక టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రచారంలో దూసుకెళుతోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకండా కూటమి అభ్యర్థులకు పడేలా ప్రణాళికలు రూపొందించుకుంది. పోలింగ్ లోపు ప్రతి ఇంటికి మూడు సార్లు వెళ్లి ప్రచారం చేసి టీడీపీ మేనిఫెస్టోతో పాటు వైసీపీతో జరిగిన నష్టాలు, పన్నుల భారాలు వివరించాలని నిర్ణయించింది. ఇక ఆ మూడు పార్టీల కూటమి నియోజకవర్గానికి ఒక కమిటీ వేసుకుని వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఇక డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తన పదేళ్ల పాలనలో వైఫల్యాలపై కడప టీడీపీ అభ్యర్థి ఆర్. మాధవీరెడ్డి వేసిన చార్జిషీట్ జనాల్లోకి బాగా వెళ్లింది.

వైసీపీలో నైరాశ్యం

జగన్ పాలనపై సొంత జిల్లాలోనే అన్ని వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అభివృద్ధి పులివెందుల పట్టణానికే పరిమితమైంది. కడపలో నామమాత్రం కాగా మిగతా చోట్ల అంతంత మాత్రమే. అభివృద్ధి కన్నా కబ్జాలు, దౌర్జన్యాలు పెరిగాయి. ఈసారి సొంత జిల్లాలో వన్‌సైడ్ కాదని వైసీపీ నేతలే భావిస్తున్నారు. పుండు మీద కారం చల్లినట్లుగా జగన్ సోదరి పీసీసీ చీఫ్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా కడప స్థానం నుంచి పోటీ చేస్తోంది. కడప పార్లమెంటు పరిధిలో బస్సు యాత్ర చేపట్టి.. ప్రధానంగా షర్మిలా, వివేకా కూతురు సునీతలు బస్సుయాత్ర పొడవునా వివేకా హత్యనే ప్రస్తావించారు. బాబాయిని చంపిన అవినాష్‌కే టికెట్ ఇస్తావా అంటూ షర్మిల, సునీతలు జగన్‌ను ప్రశ్నిస్తూ వచ్చారు. అయితే జగన్ పాలనలో అభివృద్ధి అటుంచితే అంతా హత్యా రాజకీయాలు, ల్యాండ్ మాఫియా, లిక్కర్, ఇసుక మాఫియ అంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో కాంగ్రెస్ ఉనికి లేదనుకున్నప్పటకీ షర్మిలా వ్యాఖ్యలు వైసీపీకి బాగా డ్యామేజీ అవుతుందని ఓ వైసీపీ ముఖ్యనేత వ్యాఖ్యానించారు. ఓ పక్క టీడీపీ దూసుకుపోతుండడం, మరో పక్క షర్మిల చెడుగుడు ఆడుతుండడంతో వైసీపీ శ్రేణులు కలవరపడుతున్నాయి.

డీఎల్ మద్దతు అదనపు బలం

మైదుకూరు నుంచి ఎలాగైనా గెలవాలన్న కసితో పుట్టా సుధాకర్‌యాదవ్ శ్రమిస్తున్నాడు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరుతో ఇంటింటికీ వెళుతున్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ నుంచి పెద్దసంఖ్యలో వైసీపీ నేతలు టీడీపీలో చేరుతున్నారు. ఇక మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి పుట్టా సుధాకర్‌యాదవ్‌కే తన మద్దతు అంటూ ప్రకటించారు. ఇప్పటికే చేరికలో ఊపందుకున్న సుధాకర్‌యాదవ్‌కు డీఎల్ మద్దతు మంచి బలమని టీడీపీ శ్రేణులు అంటున్నారు. ఆయన అనుచరులంతా సుధాకర్‌యాదవ్‌కు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

ప్రొద్దుటూరులో మారిన రాజకీయ సమీకరణలు

ప్రొద్దుటూరు అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని ప్రకటించిన తరువాత అక్కడ ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారిపోయాయి. వరద రాజులరెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. ప్రొద్దుటూరు పెద్దాయనగా గుర్తింపు పొందారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని వ్యతిరేకిస్తున్న సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి ఇతరులం తా సైకిలు ఎక్కేశారు. ప్రొద్దుటూరు భూకబ్జాలు, దౌర్జన్యాలు లేని పట్టణంగా మారుస్తామంటూ చెప్పుకొస్తున్నారు. ఇక టికెట్ ఆశించి భంగపడ్డ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ నాయుడు, లింగారెడ్డిలకు చంద్రబాబు అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కలిసికట్టుగా ఉన్నారు.

కమలాపురంలో జోరుగా వలసలు

కమలాపురంలో టీడీపీ ప్రచారం జోరుగా సాగుతోంది. పుత్తా నరసింహారెడ్డి ఆయన సతీమణి పుత్తా సరళమ్మ, పుత్తా చైతన్యరెడ్డి ఆయన సతీమణి చైతన్య కుటుంబీకులంతా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. చెన్నూరు, వల్లూరు, పెండ్లిమర్రి, సీకేదిన్నె, కమలాపురం మండలలాల్లో వైసీపీ నుంచి పెద్దఎత్తున టీడీపీలో చేరుతున్నారు. ఇది అదనపు బలమని అంటున్నారు. ఎమ్మెల్యే వ్యతిరేకులంతా టీడీపీ గూటికి చేరుతున్నారు. దీంతో టీడీపీ గెలుపు ఖాయమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

జమ్మలమడుగులో కుదిరిన సఖ్యత

పొత్తులో భాగంగా జమ్మలమడుగును బీజేపీకి కేటాయించింది, ఇక్కడ మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జ్‌గా భూపేష్‌రెడ్డి ఉన్నారు. అయితే జమ్మలమడుగు సీటు బీజేపీకి కేటాయించడంతో భూపేష్‌రెడ్డి కడప పార్లమెంటుకు పోటీ చేస్తున్నారు. ఇద్దరూ బంధువులు కావడంతో ఇక్కడ రెండు పార్టీల నేతల మధ్య సఖ్యత కుదిరింది. ఓటు బదిలీకి కూడా మార్గం సుగమమం అయిందంటారు. విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. భూపేష్‌రెడ్డి జమ్మలమడుగులో పర్యటించారు. టీడీపీ కేడరుకు అందుబాటులో ఉన్నారు. అక్కడ పార్టీ బలంగా ఉందంటారు.

బద్వేలులో ఉమ్మడిగా ముందుకు

బద్వేలులో పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారు ఇక్కడ రోశన్న పోటీ చేస్తున్నారు. ఆరు నెలలుగా రోశన్న టీడీపీ తరపున పర్యటించారు. ఇక్కడ బద్వేలు, అట్లూరు, గోపవరం, బికోడూరు, పోరుమామిళ్ల, కలసనాడు, కాశినాయనలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఇక్కడ బీజేపీకి టిక్కెట్ కేటాయించినా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు రితీష్ రెడ్డిలు కూటమి తరపున ముందుకు నడిపిస్తున్నారు. మండలాల వారీగా సమావేశాలు, ఉమ్మడి సమావేశాలు ఏర్పాటు చేసి కూటమి నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపుతున్నారు.



దూసుకుపోతున్న టీడీపీ

ఈ ఎన్నికల్లో ఎలాగైనా జిల్లాలో పూర్వవైభవం చాటేందుకు టీడీపీ ముమ్మరంగా పావులు కదుపుతోంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ యువగళం పాదయాత్ర, చంద్రబాబు ప్రజాగళం, ప్రాజెక్టుల సందర్శన, ఇతరత్రా వాటితో రెండేళ్లలో పలుమార్లు జిల్లాకు వచ్చారు. ఇక అభ్యర్థుల ప్రకటన కూడా అయిపోయింది. కడప టీడీపీ అభ్యర్థిగా పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవీరెడ్డిని ఎంపిక చేశారు. ఆమె ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరుతో కడప నగరాన్ని చుట్టేస్తోంది. ముఖ్యంగా కడపలో తాగునీటి సమస్య, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అనుచరుల భూకబ్జాలు, గంజాయి, అభివృద్ధిపై ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తుండడం అంజద్‌బాషా శిబిరంలో కలవరం పుట్టిస్తుంది. జగన్ సీఎం అయ్యాక జనంపై పన్నుల భారం, కరెంటు చార్జీల పెంపు, చెత్త పన్ను ఇతర పన్నులు వేస్తున్నారు. పెద్దసంఖ్యలో వైసీపీ నుంచి మైనార్టీలు ఇతర నేతలు మాజీ కార్పొరేటర్లను టీడీపీలోకి చేర్చుకున్నారు. ఒకప్పుడు బలహీనంగా కనిపించిన టీడీపీ నేడు బలంగా కనిపిస్తోంది. మొన్నటి వరకు గెలుపు మాదేనని ధీమాగా ఉన్న వైసీపీకి ఇప్పుడు ముచ్చెమటలు పడుతున్నాయి.

చంద్రబాబు సభ సక్సెస్‌తో జోష్

పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక చంద్రబాబు సీఎం అయితే బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ద్వారా ప్రతి కుటుంబానికి జరిగే లబ్ధి వివరిస్తున్నారు. వివేకా హత్య కలిసి వస్తుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. గత ఏడాది ఇక్కడ చంద్రబాబు సభ భారీ సక్సెస్ కావడం టీడీపీలో జోష్ నింపింది.

బీబీ నాంచారమ్మకు పుట్టింటి సారె

- దేవుని కడప ఆలయాన్ని సందర్శించిన ముస్లిం మహిళలు



స్వామి వారి దర్శనం కోసం క్యూలో వున్న ముస్లిం మహిళలు

కడప(కల్చరల్), ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా తిరుమల తొలి గడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం పలువురు ముస్లిం మహిళలు సందర్శించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరిన శ్రీవారికి తెల్లవారు జామునే ముస్లిం మహిళలు ప్రత్యేకించి తొలిపూజ నిర్వహించారు. తిరుమలేసుడి రెండవ అర్ధాంగి అయిన బీబీ నాంచారమ్మను ముస్లింలు వారి ఆడబిడ్డగా భావిస్తారు. దీంతో ఉగాది రోజు దేవుని కడపలోని శ్రీవారి ఆలయాన్ని సందర్శించి స్వామివారి సేవలో తరించి ఆడబిడ్డ కానుకలను సమర్పిస్తారు. అందులో భాగంగా బియ్యం, బేడలు, ఉప్పు, చింతపండు, బెల్లంతో పాటు వివిధ రకాల కూరగాయలు సమర్పించారు. ఉగాది పర్వదినాన తమ ఆడబిడ్డ అయిన బీబీ నాంచారమ్మకు పలు దినుసులిచ్చి భక్తితో శ్రీనివాసుడిని దర్శనం చేసుకున్నారు. మా ఆడబిడ్డకు ఎలాంటి కష్టం వాటిళ్లకుండా మంచిగా చూసుకోవాలని... స్వామి వారిని కోరుకుంటామని ముస్లిం మహిళలు వెల్లడించారు.



దినుసులతో ఆలయానికి వచ్చిన ముస్లిం మహిళ, ఆలయంలో స్వామివారి ప్రసాదాన్ని ఆరగిస్తున్న ముస్లింలు


ఉగాది పురస్కారాలు ప్రదానం



అర్చకులకు ఉగాది పురస్కారాలు అందజేస్తున్న జేసీ గణేష్‌కుమార్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 9: దేవదాయశాఖలో అర్చక సిబ్బందికి తెలుగు సంప్రదాయం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ప్రదమైన ఉగాది పురస్కారాలను ప్రదానం చేయడం సంతోషించదగ్గ విషయమని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని జిల్లా దేవదాయశాఖ పరిధిలో సేవలందిస్తున్న ఆరుగురు అర్చకులు, వేదపండితులకు జాయింట్ కలెక్టర్ ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ గౌరవ పురస్కారాలను జిల్లాకు చెందిన వేంపల్లి నీలకంటేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు ఎస్.సాయిప్రసాద్‌శర్మ, కడపలోని గడ్డి బజారు బాలాజీ దేవస్థానం అర్చకులు విజయ్‌కుమార్, దేవుని కడప సోమేశ్వరస్వామ దేవస్థానం అర్చకులు ఎం.సుబ్రమణ్యం, ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవస్థానం అర్చ కులు వీణా మనోజ్ కుమార్, పవన్‌కుమార్, కొండాపురం లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అర్చకులు వరప్రసాద్‌శర్మలకు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. ఇందులో ఒక్కొక్కరికి రూ.10116 సంభావన, శాలువా, దోవతి, కండువా ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సమాజం సుఖ శాంతులతో వర్ధిల్లాలని ప్రతిరోజు దైవసేవలో నిమగ్నమయ్యే ఆలయ అర్చకులు, వేద పండితులకు రాష్ట్ర దేవాదాయ ధర్మదాయశాఖ కల్పిస్తున్న ఈ గౌరవ పురస్కారం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు కలెక్టరేట్ సిబ్బందికి ఉగాది పచ్చడి, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉండాలని అర్చకులు ఆశీర్వ చనాలు పలుకుతూ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్, జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనరు శంకర్ బాలాజీ, ఈవోలు రమణారెడ్డి, శ్రీధర్, ఏ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే సరి...



సుందరీకరణకు నోచుకోని దేవునికడప చెరువు

- ఒక్క అడుగుముందుకు సాగని పనులు
- అటకెక్కిన దేవునికడప చెరువు సుందరీకరణ
- ట్యాంక్ బండ్ తరహా అభివృద్ధి అంటూ వైసీపీ కడప జనానికి త్రీడీలో సినిమా

(కడప - ఆంధ్రజ్యోతి): ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు కనికట్టు చేయడంలో వైసీపీ నేతలకు తెలిసినట్లుగా ఎవరూ చేయరనే అంటారు. చేయని దాన్ని కూడా చేసినట్లు.. అసలు లేనిది కూడా ఉన్నట్లు... జరగనిది కూడా జరిగినట్లు సృష్టించి చెప్పడం వైసీపీకే చెల్లిందంటారు. బుగ్గవంకపై రవీంద్రనగర్, గుర్రాలగడ్డ వెళ్లే దారిలో రూ.23 కోట్లతో బ్రిడ్జిలు కడుతున్నట్లు శంకుస్థాపన చేశారు. అసలు దానికి కమిటీ ఆమోదమే లేదు. తీరా అది ఉత్తుత్తి శంకుస్థాపన అని తేలిపోయింది. ఇక దేవుని కడప చెరువును హైదరాబాదు ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామంటూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబులు కడప జనానికి త్రీడీలో సినిమా చూపించారు. చెరువు అభివృద్ధిని ఆహా ఓహో ఇలా ఉందంటూ జనాలకు చూపించారు. అంతా నిజమే అనుకున్నారు. కానీ ఏళ్లు గడుస్తున్నా చెరువులో చిటికిన వేలంత పనులు కూడా జరగలేదు.

సీఎం వైఎస్ జగన్ దేవుని కడప చెరువు సుందరీకరణ పనులకు రూ.55 కోట్లు కేటా యించి 2021 జూలై 9న శంకుస్థాపన చేశారు. హైదరాబాదు ట్యాంక్ బండ్ తరహాలో చుట్టూ వాకింగ్ ట్రాక్, బోటింగ్, పిల్లలు ఆడుకునేందుకు పార్కు, అత్యాధునిక వసతులతో పార్కు నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. సాక్షాత్తు సీఎం జగనే టెంకాయ కొట్టడంతో దేవునికడప చెరువు సుందరీకరణ అయిపోతుందని జనం భావించారు. కడప వాసులకు సరైన టూరింగ్ ప్లేస్ లేదు. శిల్పారామం, అటవీకి సంబంధించి పార్కు ఉన్నా బోటింగ్, వాకింగ్‌టాక్ ఇతర సదుపాయాలు లేవు. ఇవన్నీ దేవునికడప చెరువులో ఏర్పాటు చేస్తామనడం, సిటీకి శివారులో ఉండడంతో ఇది మంచి టూరింగ్ ప్లేస్‌గా అవుతుందని భావించారు. హైదరాబాదు ట్యాంక్‌బండ్ కడపకే వచ్చేసినట్లు జనం సంతోషించారు. ఇవాళ అయిపోతుంది, రేపు అయిపోతుంది, పనులు చేస్తున్నారులే అనుకున్నారు. అయితే ఇంత వరకు మొదలే కాలేదు. చెరవు అభివృద్ధితో పాటు అంబేద్కర్ సర్కిల్, వైజంక్షన్ రోడ్డు, గోకుల్‌లాడ్జి, కృష్ణాసర్కిల్, అన్నమయ్యసర్కిల్, దేవునికడప రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. వాటిల్లో కొన్ని పనులు పూర్తయినప్పటికీచెరువు సుందరీకరణ పనులు మాత్రం అటకెక్కించారు. కొండంత రాగం తీసి చివరికి కూనిరాగంతో సరిపెట్టినట్లు దేవునికడప చెరువు అభివృద్ధిపై ఎన్నో మాటలు చెప్పారు.. పనులు మాత్రం మొదలు కాలేదు.

సీఎం బొమ్మతో చిక్కులు

- బొమ్మ తెచ్చిన తంటా
- ధ్రువపత్రాలన్నిటిపైన జగన్ చిత్రం
- సచివాలయాలు, మీసేవ కేంద్రాలలో కొత్త స్టేషనరీ కొరత
- ఈసీ ఆదేశంతో పాతవాటిపై నిషేధం
- ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల ఇక్కట్లు

పులివెందులటౌన్, ఏప్రిల్ 9: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ధ్రువీకరణ పత్రాల మంజూరుకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. గ్రామ, వార్డు సచివాలయాలలో, మీసేవ కేంద్రాలలో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అన్ని ధ్రువీకరణ పత్రాలలో సీఎం జగన్ ఫొటో ఉండడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం పత్రాల జారీని నిలిపివేశారు. దీంతో రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులు, నిరుద్యోగులకు జనన, మరణ, ఆదాయ ధ్రువీకరణపత్రాలు అవసరం. రైతులకు వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేయాలంటే బ్యాంకులకు 1బి, అడంగల్ జతపరచాలి. వీటితో పాటు ఈపాస్, ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాల కోసం వారు సచివాలయాలలో దరఖాస్తు చేసుకుంటే అక్కడి సిబ్బంది వాటిని తీసుకోవడం లేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తిరస్కరిస్తున్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోవడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం వివిధ రకాల ధ్రువీకరణపత్రాలను ఆన్‌లైన్‌లో జారీ చేయాలన్న ఉద్దేశ్యంతో మీసేవ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎవరికైనా ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత అధికారులు ధ్రువీకరించిన తర్వాత మళ్లీ మీసేవలో ధ్రువీకరణపత్రాలు తీసుకోవాలి. అప్పట్లో స్టేషనరీపై రాజకీయ నాయకుల ఫొటోలు ఉండేవి కావు. మీసేవ సింబల్‌తో పాటు ప్రభుత్వ ఎంబ్లమ్ మాత్రమే ఉండేది. ఎన్నికలు జరిగే సమయంలో కూడా ఈస్టేషనరీ పేపర్లు వినియోగించేవారు. దీని వల్ల ఎవరికి ఇబ్బంది ఉండేది కాదు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత





కొత్తగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అనంతరం అప్పటి వరకు ఉన్న స్టేషనరీని నిలిపివేసి కొత్త పేపర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ స్టేషనరీపై సీఎం చిత్రంతో పాటు నవరత్నాలు, ప్రభుత్వ ఎంబ్లమ్ ఉన్నాయి. ఈ స్టేషనరీపై 1బీ, అడంగల్, కుల, ఆదాయ, నివాస, మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సీఎం ఫొటోతో అందిస్తున్న స్టేషనరీ నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ఆగాలంటూ సచివాలయం సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్ చిత్రం ఉండడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వాటిని జారీ చేయలేమని అధికారులు సమాధానమిస్తున్నారు. దీంతో ధ్రువీకరణ పత్రాలపై రాజకీయ నాయకుల చిత్రాలు ఎందుకు ముద్రిస్తున్నారని.. గతంలో ఎప్పుడు ఇలా లేదని, వైసీపీ అధికారంలోకి వచ్చాకే ఇటువంటి చిత్రాలు చూస్తున్నామని పలువురు చెబుతు న్నారు. అత్యవసరమైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు అని, సీఎం జగన్ చిత్రాలు లేని పత్రాలు వచ్చిన తర్వాతే ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని, ప్రస్తుతానికి ధ్రువీకరణ పత్రాలు జారీచేయడం లేదని అధికారులు తెలియజేస్తున్నారు. సచివాలయ పరిధిలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు తక్కువ స్థాయిలో సామగ్రి మంజూరైందని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. సీఎం చిత్రం లేని ధ్రువీకరణపత్రాలు సచివాలయం పరిధిలోని కొన్ని మాత్రమే అందజేస్తున్నారు. సర్టిఫికెట్ల కొరత వాస్తవమేనని సిబ్బంది అంటున్నారు. మీసేవ కేంద్రాలలో స్టేషనరీ కొరత వల్ల ధ్రువీకరణ పత్రాలు అందుకోలేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో సీఎం జగన్ చిత్రం ఉన్న పత్రాలు నిలుపుదల చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు సీఎం జగన్ నవరత్నాల చిత్రాలను తొలగించి నూతనంగా ముద్రించిన పత్రాలు సచివాలయాలకు కొంత మేరకు పంపినట్లు సమాచారం. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపడుతున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. లోగోలు లేని సర్టిఫికెట్లు ఇక నుంచి జారీ చేయనున్నారు. కొత్త స్టేషనరీ ప్రతి సచివాలయానికి మొదట్లో 30 పేపర్ల చొప్పున అందిస్తామన్నారు. కొద్ది రోజుల తర్వాత పూర్తిస్థాయిలో సచివాలయాలకు, మీసేవలకు అందించేలా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.



సీఎం చిత్రంతో ఉన్న ధ్రువీకరణపత్రం

'పట్టు' కోల్పోతోంది

నాడు కళకళ - నేడు వెలవెల ● అధికారుల పర్యవేక్షణ లోపం

ఐదెకరాల భూమి నిరుపయోగం ● పట్టు పరిశ్రమల కేంద్రానికి పూర్వవైభవం ఏదీ



పాడుబడిన భవనాలు

ఓబులవారిపల్లె, ఏప్రిల్9: నాడు కళకళలాడిన పట్టు పరిశ్రమల కేంద్రం నేడు వెలవెల పోతూ పట్టుకోల్పోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో కడప-చెన్నై నేషనల్ హైవేను ఆనుకుని ఉన్న ఐదెకరాల భూమి నిరుపయోగంగా మారిందని చెప్పవచ్చు. ఇందులో గతంలో ఏర్పాటు చేసిన ముళ్లకంచె, దానికి ఒక గేటు ఉన్నది. ఇది పక్కా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన పట్టు పరిశ్రమల శాఖది. 1985 జనవరి 6న జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ చాకీ పట్టుపురుగుల పెంపకం ద్వారా పట్టు పరిశ్రమ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 40ఏళ్ల కిందటే అటు ఉద్యోగులు, ఇటు రైతులు ఆదాయం పొందేందుకు ముందు చూపుతో ఏర్పాటు చేసిన కేంద్రానికి అప్పటి ఐఎఫ్ఎస్ అధికారి అయిన ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్‌డీరెడ్డి, కలెక్టర్ భట్టాచార్య పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ముక్కవారిపల్లె వద్ద సుమారు ఐదెకరాల భూమిని కేటాయించారు. ఈవిషయం ప్రస్తుతం శిధిలమై ఉన్న నాటి భవనాలకు ఏర్పాటు చేసిన శిలాఫలకం ఆధారంగా తెలుస్తోంది.

చాకీపట్టు పురుగుల పెంపకం కేంద్రం

మల్బరీ పట్టుపురుగుల జీవిత చక్రంలో ఐదు దశలు ఉంటాయి. గుడ్డు నుంచి పట్టుపురుగులు బయటకు వచ్చిన రెండు దశలను చాకి పురుగులు (చాకి దశ) అటారు. మూడో దశను మధ్యస్తం అని, 4, 5 దశలను పెద్ద పట్టు పురుగులు అంటారు. గుడ్డు దశ నుంచి రైతుకు ఉపయోగపడే దశ సుమారు 8 రోజుల పాటు సరైన చర్యలు చేపట్టి రైతులకు అందించే పురుగుల పెంపకం దశను చాకి పట్టుపురుగు కేంద్రం ద్వారా చేపడతారు. ఈ దశల్లో పెరిగే పురుగులకు సరైన వాతావరణం కల్పిస్తూ పోషకాలతో కూడిన ఆహారం అందించాలి. అనంతరం పురుగు పెరిగే దశ నుంచి గూళ్లు కట్టే వరకు రైతులు చూసుకుంటారు. ఈ ప్రక్రియను సుశిక్షితులు, అనుభవజ్ఞులైన వారి ద్వారా పెంపకాన్ని చేపట్టాల్సి ఉంటుంది. పురుగుల పెంపకం దశలో వచ్చే లోటుపాట్లను రైతులకు చెప్పడానికి తగిన సిబ్బంది అందుబాటులో ఉండేవారు. చాకీ పురుగుల పెంపకానికి కావాల్సిన వాతావరణం కల్పించేందుకు అనువైన గదులను పొందు పరుస్తూ రెండు బిల్డింగులను ఏర్పాటు చేశారు. రైతులకు శిక్షణ కేంద్రం, చాకీ పురుగుల పెంపకం కేంద్రంగా బిల్డింగ్‌లుగా ఉన్నవి. ప్రస్తుతం అవి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. సిబ్బంది బిల్డింగ్ మాత్రం వాడుకలో ఉంది. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉన్నారు. వారిది టెక్నికల్ ఆఫీసర్ కేడర్. వారు చేసే పని మొక్కలు పెంపకం, పరిరక్షణ. దానికి పేరు మోడలింగ్ ప్లాంటేషన్. ఐదెకరాల్లో ఆ కేంద్రంలో అర ఎకరాలో మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం మండల కేంద్రానికి నడిబొడ్డునే, నేషనల్ హైవే ఆనుకుని జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, అటువైపు చూస్తూ వెళుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కొండలు, గుట్టలు, కాల్వలు, వంకలు, చెరువులు సైతం కబ్జాలు చేస్తున్న ఈ కాలంలో అన్ని సౌకర్యాలు ఉన్న ఈ చాకీ పట్టుపురుగుల పెంపకం కేంద్రానికి మోక్షం రాలేదు. ఈ కేంద్రానికి ఎదురుగా ఉన్న చెరువును సైతం అక్రమ మార్గంలో పొందేందుకు సిద్ధం చేసి ఉన్నారు. దీన్ని పట్టించుకోకపోతే భూకబ్జాదారులకు భోజ్యం అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రానికి నీటి వనరుల కొరత ఉందని చెబుతున్నారు. గతంలో బోరు నీరు బాగా ఉండేదని, ప్రస్తుతం ఒక బోరులో తక్కువ నీరు వస్తున్నా దాన్ని పారిస్తూ మొక్కలు పెంచుతున్నారు. నాడు డ్రిప్ వ్యవస్థ ద్వారా మొక్కలు పెంచి పెద్ద పురుగులు పెంచే రైతులకు అవసరం ఉన్న వారికి ఆకును అందించేవారు. ప్రస్తుతం శిధిలావస్థకు చేరుకుంది. రైతులకు షెడ్లు, పురుగులు అందించి పట్టు పరిశ్రమల ద్వారా రైతులకు ఆదాయం వచ్చేలా సూచనలు, సలహాలు ఇచ్చేవారు. ప్రక్రియ పూర్తి కాగానే అనంతపురం, కదిరి, కడపకు వెళ్లి అమ్మకాలు చేసుకునేలా అప్పటి అధికారులు తెలిపేవారని రైతులు చెబుతున్నారు. ఏదిఏమైనా ఈ శాఖ అధికారులు ఓబులవారిపల్లె మండలంలో ఉన్న ఈ చాకీ పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని ఆశావాహులు అయిన రైతులు మొక్కల పెంపకం చేపట్టి షెడ్లు నిర్మాణం చేపట్టిన రైతులకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గణనీయమైన ఉత్పత్తి సాధించి మంచి ఆదాయం పొందేదని, ఇన్నిరకాల వసతులున్న ఇలాంటి కేంద్రానికి కలెక్టర్, అధికారులు చర్యలు చేపడితే రైతులకు, యువతకు ఉపాధి కల్పించినవారు అవుతారు.





పొలానికి వెళ్లేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న మరోదారి - ప్రధాన గేటుకు ముళ్లకంపతో మూత

కేంద్రాన్ని బాగు చేస్తే అందరికీ మేలు

గతంలో ఇక్కడ చిన్న పురుగులు పెంచి రైతులకు తక్కువ రేటుకు ఇచ్చేవారు. అలాగే సూచనలు, సలహాలు ఇచ్చేవారు. అప్పట్లోనే ఈ పట్టుపురుగులు పెంచి గూళ్లు అమ్మి మంచి ఆదాయం తీసుకుంటూ ఉండేవాళ్లం. అన్ని వసతులు ఉన్న ఈ కేంద్రాన్ని బాగు చేస్తే అందరికీ మేలు జరుగుతుంది.

పోకూరు జయన్న, చిన్నఓరంపాడు

అడిగిన ప్రతి ఒక్కరికీ సలహాలు ఇస్తాం

అప్పట్లో ఈ కేంద్రం బాగా నడిచేది. ఇక్కడ ప్రస్తుతం నీరు సరిపడా లేదు. దీన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. ఆక్రమణకు గురికాకుండా మేము ఉన్నంత వరకు చూస్తాము. మోడలింగ్ ప్లాంటేషన్ చేస్తున్నాం. అడిగిన వారికి సలహాలు ఇస్తాము.

నరసింహులు, టెక్నికల్ ఆఫీసరు

సలహాలు ఇచ్చేవారు లేక మానుకున్నాం

పట్టు పరిశ్రమ అధికారుల సలహాలతో సాగు చేయడం వలన మంచి ఆదాయం వచ్చేది. ప్రభుత్వం సబ్సిడీతో షెడ్లు నిర్మాణం చేసుకోవాలని చెప్పడంతో మా పొలంలో ఏర్పాటు చేసుకున్నాం. కొంత కాలం దిగుబడి పొంది ఆదాయం పొందాం. సరైన సలహాలు ఇచ్చేవారు లేక మానుకున్నాం.

దాసరి కేశవులు, ఓబులవారిపల్లె

రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి వెండి పల్లెం బహూకరణ



చౌడేశ్వరి అమ్మవారికి వెండి పల్లెం అందిస్తున్న దాతలు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 9: స్థానిక మేదరవీధికి చెందిన రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి రెండు కిలోల వెండిపల్లెంను శ్రీమందలపాల వెంకట రాఘవేంద్ర, సుష్మ, మాలెపాటి రవితేజ సుధామాధురి దంపతులు ఆలయ కమిటీ అధ్యక్షుడు వుట్టి నాగశయనానికి అందజేశారు. మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా 1.60 లక్షలు విలువైన వెండిని అమ్మవారికి ఆభరణాల తయారీ నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు గిద్దలూరు ఈశ్వరయ్య, మచ్చ వెంకట సుబ్బరాయుడు, పోసా శివప్రసాద్, కాటం రామకృష్ణ, కాటం బ్రహ్మయ్య, ఉట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి



క్రా డేవిడ్ మృతదేహం

వల్లూరు, ఏప్రిల్ 9: ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు కడప రామాంజనేయపురం వాసి క్రా డేవిడ్ (31) డ్యాం వద్దకు వచ్చి నీటిలో ఈదులాడుతుండగా ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ప్రాణాలు వదిలాడని తెలిపారు. ఇతను చెన్నై నివాసి అయితే ఎనిమిది నెలల కిందట వల్లూరులో ప్రేమ వివాహం చేసుకుని కడపలో నివసిస్తూ ఎలక్ట్రికల్ పనులకు వెళ్లేవాడు. భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధ మహిళ మృతి

కొండాపురం, ఏప్రిల్ 9: ఏటూరు వాసి రామసుబ్బమ్మ(80) మంగళవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. రామసుబ్బమ్మకు ఆరోగ్యం సరిగాలేదని ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆమె విషద్రావణం తాగినట్లు వైద్యులు తెలిపినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. చికిత్స పొందుతూ ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందినట్లు తెలిపారు. ఈమెకు నలుగురు కుమారులున్నా ఒంటరిగా ఉంటోంది. ఈమె ఇంట్లో ఎలుకలమందు డబ్బా ఖాళీగా పడి ఉండడంతో ఈ ద్రావణం తాగి ఉంటుందని అనుమానిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేడుకగా పెద్దపీరయ్య ఆరాధన మహోత్సవాలు

భక్తులతో కిటకిటలాడిన సిద్దయ్యగారిమఠం ● కాలజ్ఞాని శిఖాఉంగరం, బెత్తంకర్ర దర్శన భాగ్యం





ప్రత్యేక అలంకరణలో పెద్దపీరయ్యస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 9: వీరబ్రహ్మంగారి ప్రియశిష్యుడు సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు మంగళవారం మఠాధిపతి రామక్రిష్ణస్వామి పర్యవేక్షణలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం 4గంటలకు పెద్దపీరయ్య స్వామికి, సిద్దయ్యస్వామికి వస్త్రాలంకరణ, ప్రత్యేక అలంకరణను చేపట్టారు. ఉగాది పర్వదినం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దపీరయ్యస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మంగారి సజీవ సమాధి వహించిన అనంతరం సిద్దయ్యస్వామికి శిఖ ఉంగరం, పావుకోళ్లు, బెత్తంకర్ర పూజా సామగ్రి అందించారు. వాటిని తన కుమారులైన పెద్దపీరయ్యస్వామికి అందించారు. ఆరాధన మహోత్సవాల్లో భాగంగా భక్తులకు స్వామి వారి పూజా సామగ్రి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులందరూ స్వామి వారి పూజా సామగ్రిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణలో భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూ చలువ పందిర్లు వేయించారు. అంతేకాకుండా తాగునీరు, మజ్జిగ, భోజన వసతి మఠాధిపతి రావక్రిష్ణస్వామి చేపట్టారు.

గ్రామోత్సవానికి రథం వితరణ

సిద్దయ్యగారిమఠంలో జరుగుతున్న పెద్దపీరయ్య స్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవానికి కనుపర్తి రామసుబ్బారెడ్డి రూ.10లక్షలు విలువైన రథాన్ని ఆలయ మఠాధిపతులకు అప్పజెప్పారు. ఈ ఏడాది అవకాశం రావడంతో రథాన్ని చేయించినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు.



రథంతో దాత రామసుబ్బారెడ్డి

అన్నసత్రాల్లో భక్తులకు అన్నదానం

భక్తులకు శ్రీ వాసవీ సిద్దగురుస్వామి ఆర్యవైశ్య అన్నసత్రం బద్వేలు కమిటీ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ గోవిందయ్యశ్రేష్ఠి, గౌరవాధ్యక్షుడు సగళా వెంకటసుబ్బ రాయుడు శ్రేష్ఠి, వైస్ ప్రెసిడెంట్ బింగి సుధాకర్‌శ్రేష్ఠి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శ్రీవాసవీ ఆర్యవైశ్య అన్నదాన సత్రం సిద్దయ్యగారిమఠం ముడుమాల కమిటీ అన్నదానం చేపట్టారు. సిద్దయ్యస్వామి అన్నదాన సత్రంలో అన్నదానాన్ని ప్రెసిడెంట్ సిద్దేశ్వరయ్య, వైస్ ప్రెసిడెంట్ సిద్దయ్య, కార్యదర్శి నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాత్రికి భక్తులకు భజన కార్యక్రమాలు, చింతామణి నాటకం నిర్వహించారు.

ప్రజలందరికీ మంచి జరగాలి

ఉగాది సంబరాల్లో జిల్లా జడ్జి శ్రీదేవి



ఏఓను సన్మానిస్తున్న

కడప(రూరల్) ఏప్రిల్ 9: శ్రీక్రోధినామ సంవత్సరాది సందర్భంగా ప్రజలందరికీ మంచి జరగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, రామారావు దంపతులు పేర్కొన్నారు. మంగళవారం జడ్జి బంగ్లాలో తెలుగు నూతన సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలన్నారు. న్యాయశాఖలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి ఉగాది పచ్చడి ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి, రామారావు దంపతులు జిల్లా న్యాయశాఖ పరిదిలో సేవలందిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని సత్కరించి ఉగాది పురస్కారాలను అందించారు. తరువాత సాయిశివశంకర్ సుందరకాండను ఆలపించారు. కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పుట్టా' కే నా మద్దతు

● రాజకీయాలకు రఘురామిరెడ్డి పనికిరాడు : డీఎల్




ఖాజీపేట, ఏప్రిల్ 9: నాతోపాటు 40 ఏళ్ల రాజకీయం చేసినవారికి ఒక్కటే సూచన. రఘురామిరెడ్డి రాజకీయాలకు పనికిరాడని సర్వేలు తేల్చాయని, అందువలన పుట్టా సుధాకర్‌యాదవ్‌కు నా మద్దతు ఉంటుందని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి ప్రకటించారు. మంగళవారం డీఎల్ తన స్వగృహంలో మాట్లాడుతూ పుట్టా సుధాకర్ మంచి వ్యక్తి కాబట్టి ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తే ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. చంద్రబాబు ఒక పద్ధతిగల రాజకీయ నాయకుడని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తారన్నారు. చంద్రబాబు ఎంతో మేధావి అని, జనసేన, బీజేపీతో పొత్తు ఎందుకు పెట్టుకున్నాడో తెలియదు కానీ ఒక్కరే బరిలో దిగినా కూడా ప్రభుత్వం ఏర్పాటయ్యేదన్నారు. నాతో ఎవరూ మాట్లాడలేదని, రాజకీయాల్లో సుధాకర్ యాదవ్ మేలు కాబట్టి నామద్దతు తెలుపుతున్నానని, నా శ్రేయోభిలాషులకు నేను అండగా ఉంటానన్నారు. ప్రతిపల్లె తిరిగి సమస్యలు డైరీలో రాసుకుని వాటిని పరిష్కరించినప్పుడే ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. వ్యక్తిగతంగా ఎజెండా లేదని, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం వస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు సూపర్-6 పథకాలను అమలు చేసి ప్రజలకు మేలు చేస్తారన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతకాలంటే ఎన్డీయే ప్రభుత్వం రావాలని, నేను గ్రామాలకు వెళ్లి ప్రచారం చేయలేను, నా దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ సుధాకర్‌యాదవ్‌కు ఓటు వేయాలని చెబుతానన్నారు.

● వివేకం సినిమా చూడాలి

ఎంపీకి ఓటు వేయాలంటే వివేకం సినిమా చూసి మీకు నచ్చిన వారికి ఓటు వేయాలన్నారు. కోర్టుపరిధిలో ఉంది కాబట్టి నేను చెప్పనని, ప్రతి ఒక్కరూ వివేకం సినిమా చూడాలన్నారు. సునీతమ్మ కూడా నాతో మాట్లాడారని, నేను వైసీపీకి మద్దతు ఇవ్వడంలేదని చెప్పానన్నారు.

ఆధునికీకరణ సరే.. ఆక్రమణలూ...?

● నేటికీ ఆక్రమణలో నాగులచెరువు
● ఆధునికీకరణకు కోటీ 40 లక్షల ఖర్చు
● పాలకపక్ష, అధికారుల వైఫల్యం



బద్వేలు రూరల్, ఏప్రిల్ 9: సకాలంలో వర్షాలు కురవడంతో నీరు సమృద్ధిగా ఉన్నప్పుడు సాగునీరు పారి పంటలు పండి, ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా ఉండేవి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సైతం నేడు చెరువులు, కుంటలు, వంకపోరంబోకు స్థలాలు ఆక్రమణలకు గురవుతుంటే పట్టించుకునే నాధుడే కరవయ్యాడు. ఆ కోవలో స్థానిక నెల్లూరు రోడ్డులో ఉన్న నాగులచెరువు దాదాపు 30 ఎకరాలు ఆక్రమణకు గురైతే ఆక్రమణలు తొలగించడంలో జాప్యం చేస్తున్న పాలకపక్ష, అధికారులు నాగులచెరువు సుందరీకరణకు దాదాపు కోటీ 40 లక్షలు ఖర్చు పెట్టడం ఎంత వరకు సమంజసమని ఆయకట్టు రైతాంగం ప్రశ్నిస్తోంది.

నాగులచెరువు విస్తీర్ణం

నాగుల చెరవు దాదాపు 184 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో చెరువులో నీరు సమృద్ధిగా ఉండి ఆయకట్టుకు నీరు పారుతుండేది. చెరువు తూర్పు భాగాన పూర్తిగా ఆక్రమణకు గురవడంతో ఓ వైపు చెరువులో మాత్రమే నీరు నిలుస్తోంది. దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరు పారిందే లేదు. నాగుల చెరువుకు 588 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. చెరువు కట్ట అంజనేయస్వామి గుడి వద్ద నుంచి చుట్టుపక్కల భూములన్నీ ఈ చెరువు నీటితోనే పంటలు పండిస్తుండేవారు. అయితే నిన్నటి వరకూ చెరువులో ముళ్లపొదలు పెరిగి కొంత మేర ఆక్రమణకు గురై ఆయకట్టు భూములకు సాగునీరందిందే లేదు. ఆక్రమణకు గురైనా చెరువులో ముళ్లపొదలు పెరిగినా సంబంధిత శాఖ అధికారులు ఇంత వరకు పట్టించుకున్న పాపాన పోలేదు.

సుందరీకరణకు రూ. కోటీ 40 లక్షలు

నాగులచెరవు 30 ఎకరాల పైబడి ఆక్రమణకు గురైతే పట్టించుకోని పాలక పక్షం సుందరీకరణకు మాత్రం రూ.కోటీ 40 లక్షలు మంజూరు చేయించుకుని సుందరీకరణ పనులు పూర్తి చేస్తున్నారు. మరో రెండు కోట్లు కూడా సుందరీకరణకే నిధులు మంజూరైనట్లు సమాచారం. దీంతో దాదాపు రూ.3 కోట్ల 40 లక్షల రూపాయలు సుందరీకరణకు నిధులు తెచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆక్రమణలు తొలగించడంలో జాప్యం వహిస్తోంది. చెరువు ఆక్రమణలు తొలగించి ఆయకట్టు భూములకు సాగునీరందించేందుకు చేయవలసిన పనులను పూర్తి చేస్తే ఆయకట్టు భూములన్నీ సస్యశ్యామలం అవుతాయన్న విషయాన్ని పూర్తిగా మరిచారు.

చెరువుల ఆక్రమణలు

పట్టణ పరిధిలో ఉన్న నాగుల చెరువు, భాకరాపేట చెరువు, చెన్నంపల్లె చెరువులకు సంబంధించిన స్థలాలను కొందరు ఆక్రమించుకుని కట్టడాలను నిర్మిస్తుంటే సంబంధిత శాఖ అధికారులు ఆక్రమణలు తొలగించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. ఎకరాలకు ఎకరాలు చెరువు స్థలాలు ఆక్రమణకు గురైతే భవిష్యత్తు తరాలకు చెరువులన్న మాటే తెలియకుండా పోతోందని తద్వారా రైతాంగం కూడా ప్రకృతి సహజ సిద్ధమైన చెరువునీటిని ఉపయోగించుకోవడం మానుకుని బోరుమోటార్లపై ఆధారపడి వ్యవసాయాన్ని సాగు చేయవలసి వస్తోందని రైతాంగం ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కానీ, అధికార వైసీపీ ప్రభుత్వం కానీ చెరువు ఆక్రమణలు తొలగించాలని వారు కోరుతున్నారు.

రైలు కింద పడి మెడికల్ విద్యార్థికి గాయాలు

కడప (క్రైం) ఏప్రిల్ 9: కడప రైల్వే స్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫారం వద్ద మంగళవారం మెడికల్ విద్యార్థిని రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడి కాలు తెగిపోయింది. కడప వాసి అధిరా గుల్బర్గాలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. గుల్‌బర్గాకు వెళ్లేందుకు రైలు బయలు దేరుతుండగా ఆమె ఎక్కబోతూ ప్రమాద వశాత్తు కింద పడిపోవడంతో ఎడమకాలు తెగిపోయింది. ప్రయాణికులు చైను లాగి రైలును నిలిపి ఆమెను ఆస్పత్రికి తరలించారు.

రూ.7లక్షలు స్వాధీనం



వివరాలు తెలుపుతున్న సీఐ

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 9: స్థానిక టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం సిబ్బందితో కలిసి రూ.7లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. స్థానిక వాసవీ సర్కిల్ దగ్గర ఆర్టీసి బస్సులో ముద్దనూరు వాసి భూమిరెడ్డి వెంకట శివారెడ్డిని తనిఖీ చేయగా అతని వద్ద రూ.7లక్షలు ఉండడం, బిల్లులు చూపనందున నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

అందరికీ శుభాలు కలగాలి

చక్రాయపేట, ఏప్రిల్ 9: ఉగాది పండుగ అందరికి శుభాలను కలిగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్ అన్నారు. ఏపీయూఎస్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నాగులగుట్టపల్లెలో ఉగాది పండుగ ఉత్సవాన్ని నిర్వహించారు. ఉగాది పచ్చడి వితరణ చేశారు. ఈ సందర్భంగా తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని గురించి వివరించారు. అలాగే ఉగాది పచ్చడి ప్రత్యేకత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవసలహాదారులు రాధాకృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, మండల కోశాధికారి మల్లేశ్వరయ్య పాల్గొన్నారు.

ఎనీ టైం మనీ లేని ఏటీఎంలు

వేంపల్లె, ఏప్రిల్ 9: వేంపల్లెలో ఏటీఎం వినియోగదారులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐ పరిధిలో చాలా మంది ఖాతాదారులు ఉన్నారు. ఆ బ్యాంకు వద్దనున్న ఏటీఎం మిషన్లు పనిచేయవు. పనిచేసే ఒక్కమిషన్‌లోను తరచూ నగదు ఉండదు. ఇక పట్టణంలోని మిగతా ప్రాంతాలలో ఏటీఎంలు ఏర్పాటు చేసినప్పటికి నగదు కొరతగానే ఉంటోంది.
మిగిలిన యూనియన్, ఏపీజీ తదితర బ్యాంకుల ఏటీఎంలలో ఎప్పుడు నగదు ఉంటుందో, మిషన్లు పనిచేస్తాయో తెలియని పరిస్థితి ఉంది. సోమవారం చాలా మంది ఖాతాదారులు ఏటీఎంలకు వచ్చి నిరాశగా వెనుదిరిగి వెళ్లారు. ఉగాది, రంజాన్ పర్వదినం రోజుల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వచ్చి నిరాశగా వెనుదిరిగి వెళ్లారు. ఎస్‌బిఐ అధికారులు ఏటీఎం మిషన్లను సక్రమంగా పనిచేసి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



వేంపల్లెలో పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లు

విజయదుర్గా ఆలయంలో ఘనంగా రాహుకాల పూజలు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి...రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప (కల్చరల్), ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం స్థానిక బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామునే విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకారం గావించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4-30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అమ్మవారి భక్తులు ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ నూతన సంవత్సరం ప్రజలందరికీ ఆనందం, సిరిసంపదలు అందించాలని ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లికార్జున రావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ అమ్మవారి భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ మేనిఫెస్టోతో ఇంటింటా ఆనందం


కమలాపురం: టీడీపీలో చేరుతున్న పెద్దచెప్పలివాసులు... చెన్నూరులో టీడీపీ మేనిఫెస్టో గురించి వివరిస్తున్న ఆ పార్టీ నేతలు

చెన్నూరు, ఏప్రిల్ 9 : టీడీపీకి ఓట్లేసి గెలిపిస్తే ఆ పార్టీ మేనిఫెస్టోతో ప్రతి ఇంటికీ ఆనందమేనని పార్టీ మండల అధికార ప్రతినిధి జడా లక్ష్మీనారాయణ, తెలుగుయువత కార్యదర్శి అతికారి విశ్వం అన్నారు. చెన్నూరు కొత్తరోడ్డు ప్రాంతంలో ప్రతి ఇంటి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. టీడీపీ ఎందుకు అధికారంలోకి రావాలి, వచ్చే కలిగే ప్రయోజనాలు, అలాగే వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరించారు. ఇప్పటికే వైసీపీ వల్ల ఎంతమేర నష్టపోయాం, అభివృద్ధి లేకుండా ఎలా పోయింది, పెరిగిన ధరలు లాంటివి వివరించారు. ఎంతో మంది చదువుకున్న యువత ప్రతి ఇంట్లో కనిపిస్తున్నారని, వారందరూ ఈ ఐదేళ్ల పాలనలో ఉద్యోగ ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా టీచరు పోస్టులపై యువతకు ఆసక్తి ఉందని, రాష్ట్రంలో ఎన్నో ఖాళీలు ఉన్నా ఈ ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. మిగతా శాఖల్లో కూడా భర్తీ చేయకుండా వలంటీర్ల పోస్టులు ఐఏఎస్ పోస్టులుగా చెప్పుకుంటూ మేం లక్షల్లో ఇచ్చామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే యువత ఉపాధి లేక కూలీలుగా వెళుతున్నారని బీఈడీ ఇంజనీరింగ్, పోస్టుగ్రాడ్యుయేషన్ చదివి కూడా ఎలాంటి ఆదరణ లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు సీఎం కాగానే వైసీపీలో ఉన్న అన్ని అరిష్టాలు తొలగి మళ్లీ కుటుంబాల్లో వెలుగు వస్తుందని, అందరికీ బతుకుదెరువు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు.

టీడీపీని గెలిపించి పథకాలు అందుకోండి

టీడీపీని గెలిపించి చంద్రబాబు మేనిఫెస్టోలో చెప్పిన సంక్షేమ పథకాలను అందుకోవాలని ఆ పార్టీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి కొండాల చెన్నయ్య, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య పేర్కొన్నారు. చెన్నూరు కొత్త గాంధీనగర్, కుమ్మరకాలనీతదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఇంటింటికీ తిరిగి టీడీపీని గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేసి మేనిఫెస్టోను వివరించారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు అందరం ఇబ్బందులు పడ్డామని, ముఖ్యంగా ఎస్సీలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావని, వారి సంక్షేమ పథకాలకు జగన్ కోత పెట్టి వాత పెట్టిందన్నారు. అందుకే ఆ పార్టీని రాష్ట్రంలో భూస్థాపితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, ఎస్సీసెల్ నేతలు శశి,వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వేధించిన వారికి ఇక అస్సామే

రాష్ట్రంలో సిట్ పేరుతో రైతులను, నేతలను వేధించిన వారికి ఇక అస్సామేనని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి జి.మల్లిఖార్జునరెడ్డి అన్నారు. చెన్నూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పాలక పక్షం ప్రతిపక్షంపై కక్షపూరిత ధోరణి అవలంభిస్తోందన్నారు. ఇష్టానుసారంగా కేసులు పెట్టడం, వారిని ఇబ్బందులు పెట్టడం అన్యాయమన్నారు. అంతేకాక సిట్ పేరుతో దొంగ కేసుల్లో ప్రతిపక్షాలను ఇరికించి వేధించడం, రాజధాని భూముల రైతులను వేధించడం, హెరిటేజ్ ప్రతులు తగలబెట్టడం లాంటి పనులు చేసిన రాష్ట్రంలో సీఐడీ డీజీ రఘురామిరెడ్డి అస్సాంకు పంపించారని, నిష్కారణంగా నిజాయితీ పరులను వేధిస్తే ఎన్నికల కమిషన్ చూస్తూ ఊరుకోదన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా ప్రభుత్వ తీరు మారలేదని, ఎప్పుడు ఏదో వంకతో ఇబ్బందులు చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇప్పుడున్న వలంటీర్లకు జీతం రూ.10వేలు పెంచుతామని మేనిఫెస్టోలో చంద్రబాబు పేర్కొన్నారన్నారు. వలంటీర్లు అధికార పక్షం మాటలు విని మోసపోవద్దని టీడీపీకి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజాహుసేన్, జిల్లా కార్యదర్శి మంజూర్ అహ్మద్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు జిలానీ, మాజీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీం, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 15 కుటుంబాలు టీడీపీలోకి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 9:పెద్దచెప్పలి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి స్వగృహంలో ఆయన సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మంగళవారం పెద్దచెప్పలి గ్రామానికి చెందిన మహబూబ్‌బాషాతో పాటు మరో 15 కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి పుత్తా టీడీపీ కండువా వేసి సాదర స్వాగతంపలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది టీడీపీ ప్రభుత్వమని టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పెద్దచెప్పలి గ్రామంలో అనేక మంది వైసీపీని వీడి టీడీపీలోకి వస్తుండడం సంతోషకరమన్నారు. వారందరికీ తాను అండగా ఉంటానని అన్నారు.

పండుగ పూటా పస్తులున్నాం.. వేతనాలివ్వండి మహాప్రభో

- నేడు ఆశా వర్కర్ల ఆందోళన


మాట్లాడుతున్న మరియమ్మ

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 9: పండుగ పూటా పస్తులున్నామని, ఆశా వర్కర్లకు వెంటనే వేత నాలివ్వాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 10వ తేదీన వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ లాంటి చిరుద్యోగులు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే వేతనాలివ్వండి మహా ప్రభో అని వేడుకున్నారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, కోశాధికారి అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ ప్రగతి కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న జనసేన నాయకుడు తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 9 : క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని జనసేన నేత తుంగా రమణయ్య అన్నారు. మంగళవారం కడప నగరం విశ్వ ప్రగతి చిట్‌ఫండ్స్ కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యాలయంలో కేక్ కట్ చేసి తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డిని కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. క్రోధి సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. జనసేన నేత మాలే శివ, ప్రముఖ కాంట్రాక్టరు రమణతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో ఘనంగా ఉగాది

చక్రాయపేట, ఏప్రిల్ 9: ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో ఉగాది పర్వదినం వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం క్రోధినామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా దేవస్థానంలో వేదపండితులు మామిడాల రామమోహన్‌శర్మచే పంచాంగ శ్రవణం గావించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి, వేద పండితులు రామమోహన్‌శర్మలను సన్మానించారు. భక్తులకు ఉగాది పచ్చడి, ఉచిత ప్రసాదం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆధ్యాత్మికవేత్త బాలశివయోగీంద్ర మహారాజ్ వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు.
సాయంత్రం పుష్పాలతో, విద్యుద్దీపాలతో అలంకరించిన రథంపై స్వామివారి గ్రామోత్సవం కన్నులపండుగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు చైర్మన్ కావలి కృష్ణతేజ, సభ్యులు బిందుసాగర్, చక్రపాణి రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం: తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 9: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ప్రారంభమైందని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి జిల్లాలో బద్వేలు, కడప, కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారని, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు స్పష్టమైందన్నారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి షర్మిలను గెలిపించాలన్నారు. సుబ్రమణ్యం, ధ్రువ, రామకృష్ణ, నరసింహారెడ్డి, అమర్, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 9 : కమలాపురం కడప - తాడిపత్రి ప్రధాన రహదారి కమలాపురం పాపాఘ్ని బ్రిడ్జ సమీపంలో బైకుపై వస్తున్న యువకుడు అదుపు తప్పి కింద పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కడప నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వేణు అనే యువకుడు అతి వేగంగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ సంఘటనలో యువకునికి గాయాలెయ్యాయి. ఆ సమయంలో రోడ్డుపై వెళుతున్న వారు 108 అంబులెన్స్‌కు ఫోను చేసి హాస్పిటల్‌కు పంపించారు. ఆ యువకుడిది మండలపరిధిలోని ననంతపురం గ్రామానికి చెందిన యువకుడుగా గుర్తించారు.

జీవితాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుకోవాలి


పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న గోపాలకృష్ణ శర్మ... పెండ్లిమర్రిలో ప్రత్యేక అలంకరణలో కొండగంగమ్మ... కమలాపురంలో పంచాంగం శ్రవణం

కడప (ఎడ్యుకేషన్)/చెన్నూరు/వల్లూరు/పెండ్లిమర్రి/ కమలాపురం/వీఎన్‌పల్లె, ఏప్రిల్ 9 : మనిషి ఎప్పటికప్పుడు తన జీవితాన్ని సరికొత్తగా, చైతన్యవంతంగా తీర్చిదిద్దుకోవాలని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడప నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షుడు, ఇంటాక్ జిల్లా కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఉగాది పండుగ సంస్కృతికి సంబంధించిందని, ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించే స్ఫూర్తినిచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, ఇంటాక్ పూర్వ అధ్యక్షుడు ఎలియాస్‌రెడ్డి, సభ్యులు పోచంరెడ్డి సుబ్బారెడ్డి, కో కన్వీనరు వీవీ సుబ్బారెడ్డి, పూర్వ కో కన్వీనరు పాలెం వేణుగోపాల్ మాట్లాడుతూ తెలుగువారి సంప్రదాయాలు ప్రకృతితో ముడిపడి ఉంటాయన్నారు. రాజంపేట ఇంటాక్ చాప్టర్ కోకన్వీనరు షేక్ అబ్దుల్లా ఉగాది సందేశం వినిపించారు.

పంచాంగ పఠనం

టీటీడీ వేదిక్ యూనివర్సిటీ అసిస్టెంటు ప్రొఫెసరు రాజేష్ భట్టర్ ఈ సందర్భంగా క్రోధి నామ సంవత్సరం పంచాంగ పఠనం చేశారు. అర్చకుడు విజయ్‌బట్టర్ బృందం నగర వాసులకు ఆశీస్సులు అందించారు.

అలరించిన కవి సమ్మేళనం

ఈ సందర్భంగా 20 మందికి పైగా కవులు ఉగాదిపై కవితాగానం చేసి ఆకట్టుకున్నారు. నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీ నిర్వహించి బహుమతులు అందించారు. కొండూరు జనార్ధన్‌రాజు సంస్థ పక్షాన ఇంటాక్ సంస్థకు కడప జిల్లా సమాచారం వివరాలను అందించారు.

ఆలయాల్లో పంచాంగ శ్రవణం

నూతన తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నూరులోని ప్రసన్న వెంకటేశ్వరాలయం, రామాలయంలలో మంగళవారం పంచాంగ శ్రవణం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయశర్మ, చెంచుగిరి స్వామి, రాజేష్‌కుమార్ స్వామి, శ్రీధర్‌స్వామి, కమలాకర్ స్వామి పంచాంగ శ్రవణం గురించి వివరించారు. చెన్నూరు ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి ముస్లిం కుటుంబం వచ్చి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వస్త్రాలు, పూలమాలలు అందించారు. రామలింగచౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. వల్లూరులో అమ్మవారిశాలలో పంచాంగ శ్రవణం పఠించారు. అన్ని ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగానిర్వహించారు.

మండల ప్రజలకు శుభాకాంక్షలు

తెలుగు సంవత్సరాది సందర్భంగా మండల కన్వీనరు కె.విజయభాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐ.శివారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు షబ్బీర్‌హుసేన్, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ తదితరులు చెన్నూరు మండల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.
నందిమండలం గ్రామంలో కొండగంగమ్మ తల్లి దేవత తిరుణాల కన్నుల పండువగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు, బండలాగుడు పోటీలు నిర్వహించారు. రాత్రికి అమ్మవారి గ్రామోత్సవాన్ని వేలాదిగా తరలివచ్చిన భక్తుల సమక్షంలో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. కమలాపురం శివాలయంలో ఉదయం నుంచి భక్తుల తాకిడి మొదలైంది. ఆలయ పూజారి కేశవస్వామి పంచాంగం చదివి వినిపించారు.

పంచాంగ శ్రవణం వివరించిన గోపాలకృష్ణ శర్మ

కడప (కల్చరల్) ఏప్రిల్ 9: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాజకీయ నాయకుల మధ్య ఎలాంటి కారణం లేకపోయినా కలహాలు చోటు చేసుకోవచ్చని జ్యోతిష్య పండితులు, నగర ఆకులవీధి రాజరాజేశ్వరిదేవి దేవస్థానం ప్రధానార్చకుడు పిడతల గోపాలకృష్ణ శర్మ పేర్కొన్నారు. ఉగాది పర్వదిన క్రోధినామ సంవత్సరం పురష్కరించుకుని మంగళవారం స్థానిక శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



పులివెందుల టౌన్, ఏప్రిల్ 9: పులివెందుల పట్టణంలోని శిల్పారామం, ఉలిమెల్ల రివర్‌ఫ్రంట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలు అలరించాయి. ముందుగా శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ శాస్త్రి పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం మహేష్, ఎస్‌కే ఫిల్మ్ స్టూడియో, దీక్ష ఈవెంట్స్, ఆర్కెస్ట్రా సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జానపద, స్కిట్స్, సినీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఒకచాన్స్ కామెడీ షో సక్సెస్ మీట్‌లో భాగంగా హీరో పులివెందుల మహేష్, డైరెక్టర్ హేమరెడ్డి, యాంకర్స్ సాయి ఈశ్వరి, సాత్విక, హనీ వారిచే కార్యక్రమం అద్భుతంగా జరిగింది. అలాగే ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో శ్రీరాజా కళానిలయం బృందంచే జానపద, కోలాటం, సినిమా పాటలకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు.

ఇందిరానగర్‌లో ఇఫ్తార్ ఇందు



సీకేదిన్నె, ఏప్రిల్ 9: మండలంలోని ఇందిరానగర్‌లో కమలాపురం టీడీపీ అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం రంజాన్ పండుగను ఎంతో ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు టి.వి.కృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, రామచంద్రారెడ్డి, వేణుగోపాల్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమృతానగర్ ప్రజల కష్టాలు తీరేదెన్నడో..?

● సమస్యలతో సతమతం అవుతున్న ప్రజలు ● బియ్యం బండి, మంచినీరు ఎప్పుడు వస్తాయో తెలియదు
● నెల, రెండు నెలలకు ఒకసారి కాలువల్లో పూడికతీత ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు



అధ్వానంగా ఉన్న మట్టిరోడ్డు, శిథిలమైన మోరీలు, కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 9: కొత్తపల్లెలో ఉన్న అమృతానగర్ ప్రజలు అరకొర మౌలిక వసతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలు ఎప్పుడు తీరుతాయోనని ఎదురుచూస్తున్నారు. ఇళ్లులేని వారి కోసం 2008లో 350 మందికి మొదటి విడత ఇళ్లపట్టాలు మంజూరు చేయగా రెండో విడతలో 8 వేల ఇళ్లపట్టాలు మంజూరు చేశారు. ప్రభుత్వం పక్కా ఇళ్లను నిర్మించడంతోపాటు సొంతంగా ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్నవారు దాదాపు 18 వేల మంది జనాబా ఉన్నారు. అక్కడ నివశించేవారంతా పేద ప్రజలు కావడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పనులకోసం ప్రతిరోజు పట్టణానికి వస్తుంటారు.

● నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియదు..: అమృతానగర్‌ను వేధిస్తున్న ప్రధాన సమస్య మంచినీరు. మంచినీరు ఎప్పుడు వస్తాయో తెలియక స్థానికులు నీళ్లకోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. ఇంటి అవసరాలకోసం ఆర్వో ప్లాంట్ల నుంచి వచ్చే వ్యర్థజలాలను తెచ్చుకుంటున్నారు. మోటార్లు ఉన్న కొంతమంది నీళ్లు వచ్చినప్పుడు నిలువ చేసుకుంటున్నారు తప్ప మిగిలినవారు నీళ్లకోసం ఇబ్బందులు పడుతున్నారు. వేళాపాళా లేకుండా నీరు వదులుతుండడంతో ఎక్కువ మంది నీళ్లు పట్టుకోలేక పోతున్నారు. నీటి విడుదలకు సమయపాలన పాటించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల ముందు నిరంతరం నీటి సరఫరా చేస్తామన్న ఎమ్మెల్యే రాచమల్లు మాటలు నీటిమూటలుగా మారాయని విమర్శిస్తున్నారు. నెలనెలా వచ్చే రేషన్ బండి ఎప్పుడు వస్తుంతో తెలియదు. ఇంటింటికీ రేషన్ అని చెప్పి ఒక్కడో దూరంగా బండి నిలిపి రేషన్ తెచ్చుకోవాలని పిలుస్తున్నారు. ముసలివారు చాలా ఇబ్బంది పడుతున్నారు. రేషన్‌షాపులు ఉన్నప్పుడే వీలైనప్పుడు బియ్యం తెచ్చుకునేవారమని, బియ్యం బండి వచ్చిన తర్వాత ఎక్కడో దూరంగా వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

● పూర్తిస్థాయిలో నిర్మించని రోడ్లు..: అమృతానగర్‌లో ఇప్పటికీ పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించలేదు. ఉన్న రోడ్లు ఎగుడుదిగుడుగా చీలిపోయి ఉన్నాయి. రోడ్లుపై నిర్మించిన మోరీలు శిథిలావస్థకు చేరాయి. కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో కాలువలు నిర్మించకపోవడంతో మురుగునీరు నిలువ ఉండి దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మురికి కాలువలను నెల, రెండు నెలలకు ఒకసారి శుభ్రం చేస్తుండడంతో పూడిక పేరుకుపోయి దుర్వాసన రావడంతోపాటు దోమలు అధికంగా ఉన్నాయి. ఎప్పుడో ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన అధికారులు వచ్చినప్పుడు మినహా ఇతర రోజుల్లో రోడ్లను శుభ్రం చేయడం లేదు. కొన్ని చోట్ల మినహా ఎక్కువ ప్రాంతాల్లో వీధిలైట్లు కూడా లేవు. చిమ్మచీకటిలోనే గడపాల్సి వస్తుంది. వర్షం వస్తే రోడ్లపై నీరు చేరి ఇళ్లలోకి నీరు చేరుతోంది.

● ఓటు వేయకపోయినా నష్టం లేదు..: ఎమ్మెల్యే రాచమల్లు అమృతానగర్‌లో పర్యటించినప్పుడు ప్రజలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వారి ప్రశ్నలకు స్పందించిన ఎమ్మెల్యే ఇక్కడకు రావాలంటే భయమేస్తోందని, అందుకే ఎవరూ రావడంలేదన్నారు. మీరు ఓట్లు వేస్తేనే గెలువలేదని, మీరు ఓట్లు వేయకపోయినా ఫర్వాలేద నడం, ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరడం నేరమా అని ప్రశ్నిస్తున్నారు.

అమృతానగర్‌లో సమస్యలు పరిష్కరించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని, ఎన్నికల సమయంలోనైనా తమ సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరుకుంటున్నారు.

● పూడిక తీయక దోమలు విజృంభన - గౌషియా



నెల, రెండు నెలలకు ఒకసారి కాలువ పూడిక తీత తీస్తుండడంతో దుర్వాసన వస్తోంది. దోమలతో రాత్రి అయితే బయట తిరగలేని పరిస్థితి. వీధిలో మట్టి రోడ్డు వేసి అయిదు సంవత్సరాలు అవుతోంది. కాలువలు శుభ్రం చేస్తే దోమల బాధ తగ్గుతుంది.

● నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియదు- మహబూబ్‌బీ



మంచినీరు ఎప్పుడు వస్తాయో తెలియదు. మంచినీటి కోసం మోటార్లు వేసి వేసి కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. నీటి విడుదలకు సమయపాలన పాటించాలి. వర్షం వస్తే రోడ్లు చెరువులుగా మారుతాయి.

● ఎమ్మెల్యే హామీలు అమలు కాలేదు - వీరాంజనమ్మ



ఎమ్మెల్యే రాచమల్లు రెండుసార్లు అమృతానగర్‌లో పర్యటించి రెండు రోజుల్లో రోడ్లు వేస్తామన్నా ఇంతవరకు వేయలేదు. పంచాయతీ ఎన్నికల సమయంలో రోజు నీరు సరఫరా చేస్తామని చెప్పినా ఇప్పటికీ నీరు ఎప్పుడు వస్తాయో తెలియదు. వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

ప్రముఖ పారిశ్రామిక వేత్త డీవీసీ మోహన్ మృతి



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 9: ప్రముఖ పారిశ్రామిక వేత్త డీవీసీ మోహన్ (86) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. ఇటీవల అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతున్న మోహన్ ఆరోగ్యం విషమించి మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు కుమార్తె వున్నారు. ప్రొద్దుటూరులో డీవీసీ కాటన్ మిల్లులతో పాటు పత్తి వ్యాపారం చేసేవారు. దేవరశెట్టి ఆదిలక్షుమ్మ మహిళా డిగ్రీ కళాశాలకు కరస్పాండెంట్‌గా కూడా ఆయన పనిచేశారు. ఆయన కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు,వైఎంఆర్ కానీలోని సాయిబాబా ఆలయం, శాస్త్రీ నగర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం చైర్మెన్‌గా సేవలందించారు. బెంగళూరులో మృతి చెందిన డీవీసీ మోహన్ భౌతిక కాయాన్ని మంగళవారం సాయంత్రం వైఎంఆర్ కాలనీలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. బుధవారం ఆయన అంత్యక్రియలు వుంటాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి, నంద్యాల కొండారెడ్డి సంతాపం ప్రకటించారు.

మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ కనుమర్లపూటి ప్రసాద్‌కు సన్మానం



ప్రసాద్‌ను సన్మానిస్తున్న సునీల్‌కుమార్

బద్వేలు రూరల్, ఏప్రిల్ 9 : టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ కనుమర్లపూటి రామచంద్ర వర్రప్రసాద్‌ను ఉగాది సందర్భంగా వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టరు మాలేపాటి సునీల్‌కుమార్, సురేంద్రకుమార్ ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా, పండ్లు స్వీట్లు అందించారు. కనుమర్లపూటి ప్రసాద్ ఆర్యవైశ్య అభివృద్ధి కోసం కృషి చేయాలని అలాగే మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని కోరుకుంటున్నట్లు సునీల్‌కుమార్ తెలిపారు.

ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు



ఉగాది పచ్చళ్లను పంపిణీ చేస్తున్న ఉమ్మడి బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 9 : ఉగాది పండుగను పురస్కరించుకుని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం పోరుమామిళ్ల లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి రోశన్న ఉగాది సందర్భంగా కార్యకర్తలు, నాయకులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. శ్రీక్రోధి నామ సంవత్సరం లో నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

మహారాష్ట్ర ఎదివ అదనపు జిల్లా జడ్జి - మరియు - మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ : ఆళ్లగడ్డ వారి కోర్టు నందు
యం.వి.ఓ.పి. నెం. 31/2022
గాజుల వెంకట ధనుంజయ ... పిటిషనర్
--వర్సెస్--
1) పత్తి భాస్కర్, 2) మెజర్స్ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ..... రెస్పాండెంట్స్
1వ రెస్పాండెంట్‌కు నోటీసు ప్రకటన
1వ రెస్పాండెంట్ చిరునామా : పత్తి భాస్కర్, తండ్రి : పి.రామయ్య, ఇడమడక గ్రామం, దువ్వూరు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా.
పై అర్జీదారునికి రోడ్డు ప్రమాదంలో గాయాలైనందున నష్టపరిహారం కోరుతూ పై నెంబరు అర్జీ నందు అర్జీదారుడు 1వ రెస్పాండెంట్ అయిన నీ పైన మరియు 2వ రెస్పాండెంట్ పైన సెక్షన్ 166(1) యం.వి.అక్టు క్రింద పై కోర్టు నందు అర్జీ దాఖలు చేసియున్నాడు. సదరు అర్జీ నందు నోటీసు నిమిత్తం 1వ రెస్పాండెంట్ అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట 18-4-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై నీ ఆక్షేపణలను తెలుపుకొనవలసినది. లేనంతట కోర్టు వారు నీ పరోక్షమందు తీర్మానం చేయగలరని యిందుమూలముగా తెలియజే యడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 18-04-2024
శ్రీ యస్.రాజగోపాల్‌రెడ్డి
అర్జీదారునిపరం అడ్వకేట్,
నంద్యాల. సెల్ : 94405 90938.

నేడు సుంకులాంబ తిరుణాల

మైలవరం, ఏప్రిల్ 9: వద్దిరాలలో వెలసిన సుంకులాంబ తిరుణాల మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్లు అలయ అధికారులు తెలిపారు. జిల్లా ప్రజలతోపాటు అనంతపురం, నంద్యాల, కర్నూల్ తదితర జిల్లాల నుంచి భక్తుల తరలిరానున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తీసుకున్నట్లు వారు తెలిపారు.

11న తలనీలాల వేలంపాట

రాజుపాలెం, ఏప్రిల్ 9 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల చెన్నకేశవ సంజీవరాయస్వామి భీమలింగేశ్వర దేవస్థానంలో 11న గురువారం 10గంటలకు తలనీలాల వేలంపాట నిర్వహిస్తున్నట్లు చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈవో నరసయ్య తెలిపారు. 24.4.2025 వరకు ఈ వేలం పాట వర్తిస్తుందని వారు తెలిపారు. వేలం పాట పాడదలచినవారు ఉదయాన్నే దేవస్థానం వారినిసంప్రదించాలని తెలిపారు.

కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్‌రావు ఆదర్శం

గోపవరం, ఏప్రిల్ 9 : భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, స్వాతంత్రసమరయోధుడు, సామ్యవాది, భూపోరాటాల ఆద్యుడుఅయిన కామ్రేడ్‌చంద్ర రాజేశ్వర్‌రావు వర్ధంతి సందర్భంగా పీపీకుంట కేంద్రం వద్ద ఆయన చిత్ర పటానికి సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భూపోరాట కమిటీ కన్వీనరు పీవీ రమణ, కో-కన్వీనరు పెంచలయ్య, ఖాదర్‌బాషా, బండి అనిల్, నాయకులు వెంకటయ్య, కమిటీ సభ్యులు ఓబులేసు, బాలు, శివ, స్వాతి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కవాతు



మైదుకూరు, ఏప్రిల్ 9 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో మంగళవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ ఏపీ మస్తాన్ ఆధ్వర్యంలో మండలంలోని వనిపెంట, మిట్టమానుపల్లె, తిప్పిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ మస్తాన్ వివరించారు.

వరదకు ఉగాది శుభాకాంక్షలు



వరదరాజులరెడ్డికి ఎన్టీరామారావు చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 9: శ్రీక్రోధినామ సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఘన విజయం సాధించాలని నందమూరి యువసేవా సమితి నాయకులు ఆకాంక్షించారు. మంగళవారం శ్రీక్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకుని వరదరాజులరెడ్డి కార్యాలయంలో ఆయనకు ఎన్టీరామారావు చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ , యువసేవా సమితి ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రామూనాయుడు, సురేష్, గురప్పయాదవ్, సుబ్బరాజు, లక్ష్మీనరసింహ, మచ్చానాగభూషణం, సురేష్‌కుమార్, మణి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వాస్తవికతకు అద్దంపట్టిన ఉగాది కవిసమ్మేళనం



కవులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 9 : సాహిత్యంలో సామాజిక వాస్తవికతకు అద్దం పట్టే లా కవిత్వం వస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు పేర్కొన్నారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రామరాజ భూష ణ సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఉగాది కవిసమ్మేళనం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు ఆవరణలోని శాఖా గ్రంథాలయంలో జరిగింది. ఈ సభకు పీఠం అధ్యక్షుడు పవన్ కిశోర్ రాజు అధ్యక్షత వహించారు. అనంతరం ఈ కవి సమ్మేళ నంలో పాల్గొన్న కవులు తమ కవితలను ఆలపించారు. కార్యక్రమంలో కవులు పల్లా వెంకట రామారావు, కాశీవరపు వెంకటసుబ్బయ్య, పుత్తూరు సుబ్రమణ్యం, గొరిగే వెంకటేశ్వర్లు, కామనూరు రామ్మోహన్, అనిల్, శివగణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు అందజేత


జమ్మలమడుగు, ఏప్రిల్ 9 : జమ్మలమడుగు ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. జమ్మలమడుగు-తాడిపత్రి రూట్ ప్రయాణికులకు గిఫ్ట్‌స్కీంలో భాగంగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు మాట్లాడుతూ జమ్మలమడుగు-తాడిపత్రి రూట్‌లో ప్రయాణికులకు గిఫ్ట్‌స్కీం ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణించే సమయంలో తీసుకున్న టిక్కెట్‌ను ఏర్పాటు చేసిన బాక్సులో అడ్రస్ రాసి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గండికోట చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ కార్మికులు జి.వెంకటేశ్వరరెడ్డి, ఎంఆర్‌జీ రెడ్డి, చౌడం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఉత్సవవిగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

రాజుపాలెం, ఏప్రిల్ 9 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ చెన్నకేశవ సంజీవరాయస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీక్రోధి నామసంవత్సర ఉగాదిని పురస్కరించుకుని చెన్నకేశవ, శ్రీదేవి భూదేవి ఉత్సవ విగ్రహాలు ఊరేగించారు. గుడి వద్ద నుంచి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు సాగింది. భక్తులు స్వామివారి ఊరేగింపులో పాల్గొని దర్శించుకున్నారు.



ఉత్సాహంగా సాగిన పంచాంగశ్రవణం



ప్రొద్దుటూరులో పంచాంగం చెబుతున్న బీవీ రామకృష్ణయ్య సిద్ధాంతి, వింటున్న ప్రజలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 9: అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగశ్రవణం ఆసక్తిగా సాగింది. మంగళవారం సాయంత్రం బీవీ రామకృష్ణయ్య సిద్ధాంతి క్రోధినామ సంవత్సరం పంచాంగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో విద్వాన్ మిట్టల ఫణిభాస్కరశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా జేవీసుధాన్సు, సాయిశ్రీచరణ్, పి.శివాణీలు ఆలపించిన భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీక్రోధినామ ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. శివాలయం సెంటర్‌లో ప్రజలకు ఉగాది పచ్చడి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆదరణ సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ పాల్గొన్నారు.

మైదుకూరు..: ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని మాధవరాయస్వామి, వాసవీమాత, సాయిబాబా, కోదండ రామాలయంతో పాటు పట్టణ శివారులోని పార్వతీనగర్‌లోగల ఓంకారేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మత సామరస్యానికి ప్రతీకగా ముస్లిం మహిళలు కూడా పలు ఆలయాలకు చేరుకొని అర్చకులకు పప్పు దినుసులు, కూరగాయలు అందించి ఆశీర్వచనం పొందారు. కాగా పట్టణంలోని అమ్మవారుశాలలో ఆలయ అర్చకులచే శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగం భక్తులకు వినిపించి వారి రాశి ఫలాలు తెలియచేశారు. కాగా పార్వతీనగర్‌లో శ్రీరామ నవమి వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రసన్న సీతారామస్వామి ఆలయంలో శ్రీరామ నవమికి ముందు 9 రోజులు అటు తరువాత 9 రోజులు మొత్తం 18 రోజుల పాటు నవమి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 17 కల్యాణోత్సవంతో పాటు 26న గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నారు. ప్రతి రోజు ఆలయ ఆవరణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించనున్నారు.

రాజుపాలెం..: గ్రామీణ ప్రాంతాల్లో ఉగాది పండుగ పురస్కరించుకుని పండుగ సంబరాలు సంతోషంగా జరుపుకుంటున్నారు. ఉగాది పచ్చళ్లు కొత్త బంధువులతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయి. మంగళవారం శ్రీక్రోధినామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ప్రజలు వైభవంగా పండుగను జరుపుకున్నారు. మధ్యాహ్నం రైతులందరూ దేవాలయానికి చేరుకుని బ్రాహ్మణుల పంచాంగ శ్రవణం ప్రకారం రైతన్నలు తూర్పు నుంచి పడమరకు పడమటి నుంచి తూర్పునకు మరలా పడమరకు పోవడం ద్వారా రైతులకు మంచి జరుగుతుందని తెలిపారు. దీంతో రైతన్నలు తమ వాహనాలు, జోడెద్దులను ప్రత్యేకంగా పూజించి పంచాంగం ప్రకారం పంట పొలాల్లో సేద్యాలు మొదలుపెట్టారు.

కొండాపురం..: మండలంలో ఉగాది పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలు చోట్ల పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు.ఉగాది మరుసటి రోజు బుధవారం పార్న సందర్భంగా తాళ్లప్రొద్దుటూరు,వెంకయ్యకాలువ తదితర గ్రామాల్లో పెద్దమ్మ, అంకాళమ్మ తదితర గ్రామ దేవతలకు దేవర నిర్వహించి జంతుబలులతో భక్తులు మొక్కుబడులు తీర్చుకోనున్నారు.



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న దృశ్యం

